నేడు పట్టణ బంద్‌ను విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 27: ఎన్టీపీసీ యాజమాన్యం భూ నిర్వాసితుల జీవితాలను చీకటిమయం చేసిందని, న్యాయం కోసం భూ నిర్వాసితుల పక్షాన బీఆర్ఎస్ చేపట్టిన పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం పిలుపునిచ్చారు. భూ నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాత ఎన్టీపీసీ విస్తరణకు చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తిలో ముఖ్యభూమిక పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఎన్టీపీసీ విస్మరించిందని ఆరోపించారు. కార్మికుల పిల్లలకు మెరుగైన విద్య, వైద్యం సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశానికి వెలుగులు అందిస్తున్న రామగుండం ఎన్టీపీసీ నిర్వాసితుల కుటుంబాల చీకట్లో ఇబ్బందులు ఎదర్కొంటున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ 2 కింద 2,400మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం కాలుష్యంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన భూములు అందిస్తున్న నిర్వాసితులకు ప్రాజెక్టులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభావిత గ్రామాలకు నిధులు కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల పిల్లకు కార్పొరేట్ స్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని తెలిపారు. 2400 మెగావాట్ల ప్రాజెక్టు కోసం కుందనపల్లి ఏరియాలో యాష్‌పాండ్ ఏర్పాటుకు 600 ఎకరాల సేకరణకు మంగళవారం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ముందుగానే నిర్వాసితులకు కల్పించే ప్ర యోజనాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాభిప్రాయ సేకరణను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని హెచ్చరించారు.

కౌటం బాబు సేవలు అభినందనీయం

కోల్‌సిటీ, జనవరి 27: శ్రీ ధర్మశాస్త్ర వ్యవస్థాపకుడు కౌటం బాబు సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక పోచమ్మ దేవాలయంలో సోమవారం ధర్మశాస్త్ర వేదిక ఆధ్వర్యంలో నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కౌటం బాబును ఆదర్శంగా తీసుకొని దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తాజా మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, చల్లా రవీందర్ రెడ్డి, మారుతి, సురేశ్, నీరటి శ్రీనివాస్, శ్రావణ్ పాల్గొన్నారు.

బందోబస్తు పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ

టీఎస్టీపీపీ ఫేజ్-2కు నేడు ప్రజాభిప్రాయ సేకరణ

● 785మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

జ్యోతినగర్, జనవరి 27: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్టీపీపీ) ఫేజ్-2 కింద చేపట్టనున్న 2,400మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు మంగళవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తెలంగాణ అవసరాల కోసం కేటాయించిన 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రాజెక్టు నిర్మాణ ఒప్పందంలో ఇప్పటికే ఫేజ్ -1 కింద 800 మెగావాట్లతో రెండు యూనిట్లలో 1600మెగావాట్ల ప్లాంటును ఎన్టీపీసీ యాజమాన్యం ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చింది. మిగిలిన 2400మెగావాట్ల ప్లాంటు నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నది.

800మెగావాట్ల చొ ప్పు న మూడు యూనిట్లకు ఇటీవలే టెండర్ ప్రక్రి య పూర్తయ్యింది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రా జెక్టు పూర్తి వివరాలను కలెక్టర్‌కు కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ద్వారా సమర్పించారు. ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్ కోయ శ్రీహర్ష చైర్మన్‌గా, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ క్షపతి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి సభా వేదిక, బారీకేడ్లు, సీసీ కెమెరాల ఏర్పా టు, ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ అనివార్య కారణాలతో రెండుసార్లు వాయిదా పడింది. ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా జరిగేలా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ 785 మందితో పోలీసు బందోబస్తు చేపడుతున్నారు. ఇందులో ఐదుగురు ఏసీపీలు, 25మంది సీఐలు, 48 మంది ఎస్ఐలు, 13మంది మహిళ ఎస్ఐలు, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు 58మంది, కానిస్టేబుళ్లు 393, మహిళా కానిస్టేబుల్స్ 145, హోంగార్డులు 62, మహిళా హోంగార్డులు 35 చొప్పున ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం బందోబస్తులో పాల్గొంటున్న పోలీసు అధికారులకు, సిబ్బంది సీపీ స్థానిక ఖాజీపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భద్రతపరమైన సూచనలు చేశారు. ఇక్కడ పెద్దపల్లి డీసీపీ చేతన, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖని, జనవరి 27: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని గోదావరిఖనిలోని యూనియన్ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి టీబీజీకేఎస్ జెండా ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మిర్యాల రాజిరెడ్డి మాట్లాడారు. జాతీయ సంఘాలు సింగరేణి కార్మికుల హక్కులు సాధించడంలో విఫలం కావడంతో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆలోచనతో టీబీజీకేఎస్ 22 ఏళ్ల క్రితం ప్రారంభమైందన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో సింగరేణి కార్మికుల హక్కులు సాధించుకున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఎన్నో హక్కులు సాధించిందని గుర్తు చేశారు. టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, నాయకులు కనకం శామ్‌సన్, చల్ల రవీందర్ రెడ్డి, పోలీసు శ్రీనివాసరావు, దూట శేషగిరి, గోపి, పల్లె సురేందర్, వరాల జోసఫ్, పులిపాక శంకర్, బొగ్గుల సాయి, ప్రసాద్, సింగరేణి ఉద్యోగులు ఉన్నారు.

టీబీజీకేఎస్ జెండా ఎగురవేస్తున్న యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

సింగరేణి అధికారుల నిర్వాకంతో అందని పరిహారం

రామగిరి జనవరి 27 : సింగరేణి అధికారుల నిర్వాకంతో అవార్డు జాబితాలో ఇండ్లు లేకపోవడం మూలంగా, తమకు పరిహారం అందలేదని లద్నాపూర్ భూనిర్వాసితుడు బడికెల శ్రీనివాస్‌తోపాటు మరో 10 మంది బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. లద్నాపూర్ గ్రామంలో సోమవారం వారు మాట్లాడారు. ఆర్జీ -3 డివిజన్ ఓసీపీ - 2 ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా తమ గ్రామమైన రామగిరి మండలం లద్నాపూర్ 2015 వెకేట్ అయ్యిందన్నారు. అందులో భాగంగా ఎంజాయిమెంట్ సర్వే చేశారని తెలిపారు. అందులో తాము నివసిస్తున్న పది ఇండ్లను పరిహారం జాబితాలో నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని అప్పటి జీఎం, ఎస్టేట్ అధికారుల దృష్టి తీసుకెళ్లగా రికార్డులు పరిశీలించి తమ ఇండ్లు తప్పిపోయినట్లు చెప్పారన్నారు. సరిచేసి రికార్డ్‌లో నమోదు చేయిస్తామన్నారని తెలిపారు. పదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు పరిహారం జాబితాలో నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఇదంతా సింగరేణి అధికారులు నిర్వాకమేనని ఆరోపించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బడికెల విజయ, భూనిర్వాసితులు రాజన్న, రొడ్డ శ్రీనివాస్, పెద్దపల్లి శ్రీనివాస్, పర్సవేన శంకర్, పుల్లెల రవి, లక్ష్మణ్, సుండిళ్ల రాజు, తోట్ల నర్సయ్య, మల్లేశ్వర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లద్నాపూర్ భూ నిర్వాసితులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

పెద్దపల్లి టౌన్, జనవరి27: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సోమవారం ప్రజావాణికి పెద్ద ఎత్తున కార్మికుల తరలివచ్చి సమస్యలు తీర్చాలంటూ నినదించారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందించారు. ఇక్కడ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు గొల్లపల్లి రజిత, పాటకుల కళావతి, నూనేటి రాధమ్మ, రేణుక, గుమ్మడి వరలక్ష్మి, మానస్ కుమార్, రాజుకుమార్, జంగం లక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మధ్యాహ్న భోజన కార్మికులు

‘ప్రజావాణి’పై పట్టింపు ఏది?

పెద్దపల్లి, జనవరి27: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై అధికారుల పట్టింపు కరువైందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారుల నుంచి స్పందన కరువైంది. తమ సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు విన్నవించుకోవచ్చని వచ్చిన అర్జీదారులకు నిరాశే ఎదురైంది. కలెక్టర్, అదనపు కలెక్టర్ల రాక కోసం ప్రజలు నిరీక్షించక తప్పలేదు. ఎట్టకేలకు సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ (హెచ్, సీ విభాగం) సూపరింటెండెంట్లు జగదీశ్వర్ రావు, బండి ప్రకాశ్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 90 దరఖాస్తులు రాగా, రెవెన్యూ శాఖకు 38, ఇతర శాఖలకు 52 అర్జీలు వచ్చాయి. జిల్లా స్థాయి అధికారులు కొంత మంది మాత్రమే హాజరు కావడంతో తమ సమస్యలను పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజావాణిలో దరఖాస్తు స్వీకరిస్తున్న సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్

పింఛన్ ఇప్పించండి

నా భర్త చని పోయిండు. మాకు గుంట భూమి లేదు. కొడుకు, బిడ్డ ఉన్నారు. వితం తు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. పింఛన్ ఇప్పించండని వేడుకుంటున్న. నెలకు రూ. రెండు వేలు వచ్చినా మాకు కొంత ఆసరా అయితది.

ఎలుకపల్లి స్వరూప, జగన్నాథపురం మారేడుగొండ, పెద్దపల్లి మండలం

ప్రమోషన్లతో మరింత గుర్తింపు, ఉత్సాహం

● రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 27: పోలీస్ శాఖలో ప్రమోషన్లతో పోలీసులకు మరింత గుర్తింపు, ఉత్సాహం వస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా, ఇద్దరు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్‌కు ఏఆర్ఎస్ఐలుగా ప్రమోషన్లు పొందిన అధికారులకు కమిషనరేట్ కార్యాలయంలో సీపీ వారికి ర్యాంకు చిహ్నం అలకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమోషన్లతో స్థాయి తో పాటు బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. ఎలాంటి రిమార్క్ లేకుండా ఉన్న సర్వీస్‌ను పూర్తి చేసి విధుల్లో ప్రతిభ చూపి మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ మల్లేశం, రామగుండం పోలీసు కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, స్వామి ఉన్నారు.

పోలీసు క్రీడాకారులకు ట్రాక్‌షూ పంపిణీ

కరీంనగర్‌లో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలకు ఎంపికైన కాళేశ్వరం జోన్ క్రీడాకారులకు సోమవారం రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ ట్రాక్ సూట్స్ అందజేశారు. ఇక్కడ పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, పోలీసు క్రీడాకారులు ఉన్నారు.

ప్రమోషన్లు పొందిన అధికారులతో రామగుండం సీపీ శ్రీనివాస్

‘రామగుండం’ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న బల్దియా ఇన్‌చార్జి కమిషనర్

కోల్‌సిటీ, జనవరి 27: రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నియమితులయ్యారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను రామగుండం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, ఈఈ రామన్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపల్లి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా అరుణ శ్రీ

పెద్దపల్లి, జనవరి27: పెద్దపల్లి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో సమావేశమై అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలుపై దిశానిర్దేశం చేశారు. ఇక్కడ మేనేజర్ కట్ట శివప్రసాద్, ఏఈ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతరోహకురాలికి సన్మానం

సుల్తానాబాద్, జనవరి 27 : కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి స్వస్థలానికి తిరిగి వచ్చిన పసెడ్ల సహస్రను సుల్తానాబాద్‌లో సోమవారం సన్మానించారు. గర్రెపల్లికి చెందిన సహస్ర కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం గర్వించదగ్గ విషయమని బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో సహస్ర తండ్రి పసెడ్ల రాజు, నల్లవెల్లి శంకర్, కొల్లూరి సంతోష్, ఇగురం రామస్వామి, వడ్లకొండ మహేశ్ గౌడ్, మల్క భాగ్యలక్ష్మి, వీరగోని కిరణ్, శేఖర్, జోగేందర్, భాస్కర్ తదితరులున్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

ముత్తారం, జనవరి 27: మండల కేంద్రంలోని కాసర్ల గడ్డలోని మూలమలుపు వద్ద అదుపు తప్పి ట్రాలీ ఆటో బోల్తా పడింది. బోర్ కేసింగ్ పైపుల లోడుతో వెళ్తున్న ఈ ఆటో మూల మలుపు వద్ద డ్రైవర్ అదుపు కోల్పోవడంతో బోల్తా పడింది. ఈ క్రమంలో అక్కడే పార్కింగ్ చేసి ఉన్న బైక్‌పై పైపులు పడడంతో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న బోర్ కేసింగ్ పైపులు రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి.

విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

గోదావరిఖని, జనవరి 27: ప్రజా కళాకారుడు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ నాయకుడు జాకబ్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక అశోక్ టాకీస్ ఎదుట సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కవ్వంపల్లి స్వామి, మడ్డి ఎల్లాగౌడ్, మహంకాళి స్వామి, దీటి బాలరాజ్, పీ శ్రీనివాస్, వేల్పుల నారాయణ, జిగురు రవీందర్, మైస రాజేశ్, ఈదునూరి పద్మ, మాదాసు రామ్మూర్తి, సీపీఐ నగర కార్యదర్శి కనకరాజ్, కార్మిక, కన్నం లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఓపెన్ స్కూల్ లో అడ్మిషన్

కాల్వశ్రీరాంపూర్, జనవరి27: బడి బయట పిల్లల సర్వేలో పెద్దరాత్‌పల్లికి చెందిన చిలుముల విశాల్ చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటున్నాడని సీఆర్‌పీ కుంట కుమారస్వామి గుర్తించారు. అతనికి ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ హైస్కూల్‌లోని ఓపెన్ స్కూల్ లో ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. విశాల్ కు చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించినట్లు వివరించారు.

కార్యవర్గం

ఓదెల, జనవరి 27: కొలనూర్ రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బోయిని కుమార్‌యాదవ్, క్యాషియర్‌గా బోదాసు మల్లేశ్‌తో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీని యూనియన్ సభ్యులు అభినందించారు.

రేషన్ కార్డులకు డబ్బులు ఇవ్వొద్దు

కోల్‌సిటీ, జనవరి 27: రామగుండం కార్పొరేషన్‌లో అధికార పార్టీకి చెందిన కొంతమంది దళారులు రేషన్ కార్డులు ఇప్పిస్తామని లబ్ధిదారుల నుంచి రూ.10వేల చొప్పున డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. 33వ డివిజన్‌లోని కొత్త రేషన్ కార్డుల కోసం జాబితాలో వచ్చిన లబ్ధిదారుల వివరాలు తెలుసుకొని వారికి నేరుగా ఫోన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. లిస్టులో వచ్చిన పేరు అధికారులు తొలగిస్తున్నారని, రేషన్ కార్డు రావాలంటే తమకు రూ.10వేలు ఇస్తే కార్డు వచ్చేలా చూస్తామంటూ ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంది రమ్మ ఇల్లు ఇప్పిస్తామమని, అందుకు రూ.లక్ష వరకు ఖర్చు వుతుందంటూ అటు లబ్ధిదారులను ప్రలోభాలకు గురి చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సురక్షిత ప్రాంతానికి తరలించండి

పెద్దపల్లి/యైటింక్లయిన్ కాలనీ, జనవరి27: సింగరేణి ఓసీపీ -3 ప్రాజెక్ట్ సంబంధించిన ఫేజ్ -2 బ్లాసింగులతో దిన దిన గండంగా బతుకుతున్నామని వెంకట్రావుపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు గ్రామస్తులు తమను సురక్షిత ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రామగిరి మం డలం వెంకట్రావుపల్లిలో దాదాపు 350 కుటుంబాలు, 10వేల జనాభా ఉందని తెలిపారు. ఓసీపీ -3 ప్రాజెక్ట్ ఊరు పక్క దాకా వచ్చిందని, బ్లాస్టింగులతో ఇప్పటికే 50 దాకా ఇండ్లు కూడ కూలిపోయాయన్నారు. బ్లాస్టింగ్ సమయంలో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఉందని, దుమ్ము, ధూళితో అనారోగ్యబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిం చి సమస్యలను పరిష్కరించాలని, వెంకట్రావుపల్లి గ్రామస్తులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు బుర్ర ముత్యాలు, శిలారపు లక్ష్మణ్, చాట్ల సదానందం, బాలసాని రాజు, కోయ్యడ వీర స్వామి, దువ్వ శ్రీనివాస్, దయానంద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, జనవరి27: ఎఫ్‌సీఐ రోడ్‌లోని మాతంగి కాలనీ కాలుష్య కోరల్లో చిక్కుకున్నదని, కాలనీ వాసులను వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు సీపీఎం నాయకులు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచి మాతంగి కాలనీ వాసులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని వివరించారు. వారిని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ సీపీఎం నాయకులు భిక్షపతి, సీపెల్లి రవీందర్, రామగుండం ఏరియా కమిటీ సభ్యులు గీట్ల లక్ష్మారెడ్డి, కాదాసి మల్లేశ్ ఉన్నారు.

పూరిల్లు దగ్ధం

పెద్దపల్లి రూరల్, జనవరి 27: పాలితం జీపీ పరిధి పుట్టపల్లిలో కారం లింగయ్యకు చెందిన పూరిల్లుకు ప్రమాద వశాత్తు నిప్పంటుకొని దగ్ధమైనట్లు పెద్దపల్లి ఫైర్ ఆఫీసర్ కే రాజేందర్ తెలిపారు. ఇంట్లో దీపం వెలిగించి ఉండడంతో ప్రమాద వశాత్తు మంటలు అంటుకొని పూరిల్లు దగ్ధమైందని, విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చినట్లు వివరించారు. ఈ ఘటనలో ఇంటి సామగ్రితో పాటు నిత్యావసర వస్తువులు కాలిపోయాయని రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3నుంచి మారుపేర్ల బాధితుల పాదయాత్ర

గోదావరిఖని, జనవరి 27: సింగరేణిలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 3 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు మారుపేర్ల బాధితులు తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. మారుపేర్లతో కంపెనీలో ఉద్యోగం లేక ఏళ్ల తరబడి పడుతున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. చివరగా సింగరేణి యాజమాన్యానికి విన్నవించేందుకు ఫిబ్రవరి 3న గోలేటి నుంచి కొత్తగూడెం వరకు పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు తమకు మద్దతు తెలుపాలని కోరారు. తమ బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాకుంటే తమకు చావే శరణమన్నారు. ఇక్కడ మారుపేర్ల బాధితులు లక్క శ్రావణ్, శ్రీనివాస్, హరీశ్, ఓంప్రకాశ్, సరోజన, రమేశ్, సునీల్ ఉన్నారు.

మదర్ థెరిసాలో వర్క్‌షాప్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పెద్దపల్లి రూరల్, జనవరి 27: పెద్దపల్లి మండలంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఐబీఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రామ్ వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ టీ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అడవల్లి నవీన్‌కుమార్ మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తమ కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఐబీఎం కంపెనీ సహకారంతో స్కిల్ బిల్డ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అశ్వినికుమార్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్ కుమార్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

సుల్తానాబాద్, జనవరి 27 : జాతీయస్థాయి టెబుల్ టెన్నీస్ పోటీలకు ఎంపికైన మాటేటి సంప్రీత్‌ను కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం అభినందించారు. స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న సంప్రీత్ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి టెబుల్ టెన్నీస్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 4 నుంచి 7వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో అరెపల్లి రాజయ్య, ప్రిన్సిపాల్ మాటేటి కృష్ణప్రియ, కోచ్ సత్యనారాయణ తదితరులున్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

గోదావరిఖని, జనవరి 27: కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలీ రేట్లను హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హమాలీలలో కలిసి మార్కెట్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2017లో పెంచిన కూలి రేట్లు ఇప్పటి దాకా పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు హమాలీలను ఇబ్బందులకు గురిచేయడం సరైందికాదన్నారు. ఇక్కడ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్, నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానిమియా, గాలిపెల్లి సతీశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు.
జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327012-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పంద